క్లుప్తంగా

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో బాబా

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కొలువైన ఉన్న శిరిడీసాయి మందిరం 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మందిరం వద్ద బాబాకు క్షీరాభిషేకం, గణపతిపూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చారు. అనంతరం బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా రొంగల రాము, రేణకాదేవి దంపతులు అన్నసమారాధన నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (అబ్బు) తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో తహసీల్దార్ విచారణ



బలభద్రపురంలో భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని భూ వివాదం విషయమై తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ విచారణ చేపట్టారు.మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదికపై వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ భూమి ఎంత, ఎవరు పేరున ఉంది, ప్రస్తుతం ఎవరి స్వాధీనంలో ఉంది, ఆ భూమి ఎలా సంక్రమించిందనే విషయాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించిన నివేదిక ఉన్నత అధికారులు తెలియజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలోని రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట ప్రణాళికలతో లక్ష్య సాధన



విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు రాజు

రంగంపేట: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదివి లక్ష్యం సాధించాలని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో రెండో రోజు ధ్యానం చేయించారు. అనంతరం తెనాలి రామకృష్ణుడు నీతి కథలను విద్యార్థులకు భోధించారు. ఉపాధ్యాయులు కె.రాజు పాల్గొని జనరల్ నాలెడ్జిపై, టి.శంకర్ బాలల గేయాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని రామకోటేశ్వరరావు అన్నారు. అనంతరం బాలల గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన కరకుదురు గ్రామంలో దోమల నివారణకు కార్మికులు చేపడుతున్న చర్యలను మంగళవారం పరిశీలించారు. ఎబేట్ పిచికారీ విధానాన్ని పరిశీలించి మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాలపై దోమల నివారణపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. మండలంలో 18 గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కనక నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పంటకు మేలు

- అనపర్తి నియోజకవర్గంలో 4884 నమూనాలు లక్ష్యం
- ఇప్పటికి పూర్తయినవి 414



దోమాడలో మట్టి నమునా సేకరణను పరిశీలిస్తున్న ఏవో మణిదీప్ (ఫైల్)



బిక్కవోలులో మట్టి నమూనాలు సేకరిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

మండలం	నమూనాల లక్ష్యం	సేకరించినవి
అనపర్తి	636	80
పెదపూడి	1,233	80
బిక్కవోలు	1015	84
రంగంపేట	2000	70
మొత్తం	4884	414

పెదపూడి: సాగు భూమిలో భూసార పరీక్ష చేయించడం వల్ల ఆ భూమిలో ఉన్న షోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచిస్తున్నారు. దీంతో సిఫార్సు చేసిన ఎరువులు వాడడంతో ఎరువులపై అనవసరమైన వ్యయం తగ్గుతుందని, భూమి సేద్యానికి అనువుగా లేని పక్షంలో ఎలా బాగు చేసుకోవాలో, దానికి ప్రత్యామ్నాయంగా ఏయే రసాయనాలు ఎంత మేర వాడాలో తెలుస్తుందని ఆయన తెలిపారు.

మట్టి నమునాలు తీయడం

పంటలకు ఆరు అంగుళాలు, లేక 15 సెంటీమీటర్ల లోతులో వీ ఆకారంలో గొయ్యి తీయాలి. పండ్ల తోటలకు ఐదు అడుగులు గొయ్యి తవ్వి అడుగుకు 1కి చొప్పున 5 నమూనాలు తీయాలి.

నమునాలు తీసేటప్పుడు జాగ్రత్తలు ఇలా

- పొలంలో పంట ఉన్నప్పుడు మొక్కల వరుసల మధ్య తీయాలి.
- అతి సారవంతమైన చోట్ల నుంచి గానీ, అతి నిస్సారమైన చోట్ల నుంచి గాని మట్టిని తీసి, ఒకే నమునా కింద కలుపకూడదు.
- రసాయనిక ఎరువులు వేయగానే మట్టి నమునాలు తీయకూడదు.
- గట్ల పక్కన, చెట్ల కింద, చిత్తడి నేలలలో, బండ్ల బాటల దారిలో, మెరక పల్లాలలో, పెంట పోగులు వేసిన చోట్ల మట్టి నమునాలు తీయకూడదు.
- మట్టి నమునాలు నింపే సంచులు రసాయన ఎరువులతో సంబంధం లేనివై ఉండాలి.
- మట్టి నమునాలు బూడిద, చీకుడు ఎరువులతో సంబంధం ఉండేలా ఉంచకూడదు.

భూసార పరీక్షతో లాభాలు

- భూసార పరీక్ష చేయించి సమతుల పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చు
2.ఎరువులను సమర్థవంతంగాను, పొదుపుగాను వినియోగించుకోవచ్చు.
- భూ సారాన్ని కాపాడుకోవచ్చు.

నీటి నమునా సేకరణ

బోరు వదిలిన అరగంట తరువాత నీటి నమునా సేకరించాలి. బావి నుంచి సేకరించేదయితే బావి మధ్య నుంచి నీరు సేకరించాల్సి ఉంటుంది. నీటి నమునా సేకరించిన 24 గంటలలో పరీక్షా కేంద్రానికి చేర్చాలి.

భూమిని సారవంతంగా చేసేందుకే



పంట సాగు చేసే భూమిలో భూసార పరీక్షలు చేయడంతో ఆ భూమిలో ఎంత మేర సారం ఉంది. పోషకాలు ఏలా ఉన్నాయో తెలుసుకుని దాని ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టి భూమిని సారవంతంగా తయారు చేస్తారు. దీంతో తక్కువ వ్యయంతో అధిక పంట దిగుబడి పెరుగుతుంది. మండలంలో భూసార పరీక్షలు విస్తృతంగా చేస్తున్నారు. మండలంలో మొత్తం 1,233 నమూనాలు సేకరించాల్సిన లక్ష్యం కాగా ఇప్పటి వారు రబీ, రాబోయే ఖరీఫ్‌కు అనుకూలంగా చేపడుతున్నారు. మే 15 నాటికి పూర్తి సేకరణ చేయాల్సి ఉంది. జూన్ మాసంలో రైతులకు నేరుగా ఫలితాలు అందజేస్తారన్నారు. దాని ప్రకారం రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తాం. ఇప్పటి వరకు 180 నమునాలు సేకరించాం. ఈ సారి రైతు సమక్షంలో రైతు సెల్ఫీ తీసుకుని ప్రతి ఆరు ఎకరాలకు ఒక నమూనా తీయాల్సి ఉంది.

– టీవీఆర్ మణిదీప్, ఎంఏఓ, పెదపూడి

ఫలితాలను ఎలా అర్థం చేసుకోవాలి

మట్టి నమునాలను పరీక్షించి పంటలను, వేయాల్సిన ఎరువులు మోతాదు, ఇతర సూచనలను భూసార పరీక్షా కేంద్రానికి ఒక కార్డు ద్వారా రైతులకు తెలియజేస్తారు. రైతుల సౌకర్యార్థం భూసార పరీక్ష ఫలితాలను ఎలా అర్థం చేసుకోవాలో కింద వివరిస్తారు.

కేంద్రంలో చేసే పరీక్షలివీ..

- **నేల స్వభావం**

భూసార పరీక్షలలో నేల స్వభావం అంటే తేలిక నేల, మధ్య రకం లేదా బరువు నేలగా గుర్తించి తెలియజేస్తారు. తేలిక నేల అంటే ఎక్కువ ఇసుకతో కూడుకొని చాల తక్కువ బంక మట్టి కలిగి ఉంటుంది. బరువు నేల అంటే తక్కువ ఇసుక కలిగి ఎక్కువ బంకమట్టి కలిగి ఉంటుంది. మధ్యస్థ నేలలో ఇసుక, బంక మట్టి ఇంచుమించు సమాన పాళ్లలో ఉంటాయి.

- **లవణాల సాంద్రత**

రైతుల పొలాల్లో సోడియం, కాల్షియం, మెగ్నీషియం మొదలైన నీటిలో కరిగే పలు రకాల లవణాలు ఉంటాయి. వీటి సాంద్రత ఎంత మోతాదులో ఉందో భూసార పరీక్షల ద్వారా తెలుసుకుని వాటి విలువలను పొందుపరుస్తారు. నీటిలో కరిగి ఉన్న లవణాల సాంద్రత, సామాన్యంగా ఉందా, మొలకెత్తటానికి వీలు లేకుండా ఉందా, లేదా పంటలకు హానికరంగా ఉందా అనే విషయాలు తెలుసుకోవచ్చు.

- **ఆమ్ల, క్షార లక్షణం**

దీనినే ఉదజని సూచిక అంటారు. ఈ పరీక్ష ద్వారా రైతు పొలం ఆమ్లము, తటస్థము, లేదా చౌడు, గుణాలలో దేనికి సంబంధించినదో తెలియజేస్తారు.

- **సేంద్రియ కర్బనం**

ఈ పరీక్ష ద్వారా నేల ఉత్పాదకశక్తి సేంద్రియ పదార్థాల మోతాదు ఎంత ఉందో తెలుస్తుంది. కార్డులో సేంద్రియ కర్బనం తక్కువ లేదా, మధ్యస్థం, లేదా ఎక్కువ ఉన్నది తెలుస్తుంది. తక్కువ, మధ్యస్థంగా ఉంది అని తేలితే కంపోస్టు ఎరువు ఏ మోతాదు వేయాలో ఫలితాలలో తెలియజేస్తారు.

- **భాస్వరం**

నేలలో ఎంత మోతాదులో భాస్వరం పోషక పదార్థం ఉంది. పరీక్ష ద్వారా తెలుసుకుని తక్కువా, మధ్యస్థమా, లేక ఎక్కువా అనేది ఫలితాలలో తెలియజేస్తారు.

- **పొటాష్**

నేలలో ఎంత మోతాదులో పోటాష్ పోషక పదార్థం ఉంది తెలుసుకుని తక్కువా, మధ్యస్థమా లేక ఎక్కువా అనేది ఫలితాలలో తెలియజేస్తారు.

నియోజకవర్గంలో

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 3,500, బిక్కవోలు మండలంలో 13 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారు.

బాధితుల కష్టాలు పట్టని నల్లమిల్లి



దోమాడలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ధ్వజం
- దోమాడ బాధితులకు పరామర్శ

పెదపూడి: దోమాడలో ఇళ్లు కోల్పోయిన బాధితులను స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇప్పటివరకు కనీసం పరామర్శించకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. గ్రామంలో చెరువు గట్టుపై ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆయన మంగళవారం పరిమర్శించి వంటా వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఈ లే అవుట్ ఉందని, ఆ సమయంలో మేము ఇళ్లు కూల్చే ప్రయత్నం చేయలదేన్నారు. ఆ వెంచర్ యజమానిని తమ వద్దకు రానివ్వలేదన్నారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో దౌర్జన్యంగా ఇళ్లు కూల్చివేశారని మండిపడ్డారు. అలాగే ఎమ్మెల్యే నల్లమిల్లి కమీషన్ కోసం నిరుపేదల ఇళ్లను తొలగించి రోడ్డున పడేశారని బాధితులు రోదిస్తున్నారని ఆరోపించారు. మరుగుదొడ్డికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉన్నదని దివ్యాంగురాలు కంటతడి పెట్టడం బాధాకరమన్నారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్‌తో చర్చించానని, ఆమె సాయం చేస్తానని హామీ ఇచ్చారని సూర్యనారాయణ రెడ్డి వివరించారు. ప్రభుత్వం నుంచి బాధితులకు సహాయం అందకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మీనవల్లి సత్తిబాబు, దున్నే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీకి పాముకాటు



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంతమ్మ

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటకు చెందిన ఉపాధి కూలీ కానేటి శాంతమ్మ పాముకాటుకు గురైంది. మంగళవారం ఉదయం ఇనుగంటివారిపేట దగ్గరలోని పంటకాలువ పూడికతీత పనులకు 101 మంది ఉపాధి కూలీలు పనికి వెళ్లారు. నలభై ఎనిమిదేళ్ల శాంతమ్మ కాలువ పూడిక తీస్తుండగా బురదలో ఉన్న పాము కుడికాలు మడమ వద్ద కాటు వేసింది. దానితో ఒక్కసారిగా కేకలు వేయడంతో కూలీలు శాంతమ్మకు సపర్యలు చేసి విషం పైకి వెళ్లకుండా కాలుపై భాగంలో రెండు చోట్ల కట్లు కట్టారు. సమాచారం అందుకున్న ఏపీఓ బీవీ సత్యవతి సంఘటన స్థలానికి చేరుకుని సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసేవలు పొందిన అనంతరం మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శాంతమ్మ ఆరోగ్య పరిస్థితి మెరుగుగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రెడ్‌క్రాస్ కార్యక్రమాలు విస్తృతం చేయాలి

- నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళిక
- సభ్యత్వాల నమోదుకు ప్రత్యేక డ్రైవ్
- జిల్లా అధ్యక్షురాలు, కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయాలని, దీని కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సభ్యత్వ నమోదు చేయాలని జిల్లా సొసైటీ అధ్యక్షురాలు, కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా ఒక కార్యక్రమం ద్వారా రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జిల్లాలో బ్లడ్ బ్యాంక్ కోసం ప్రతిపాదనలు పంపాలని, ఇందుకు సంబంధించి అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్థిక లావాదేవీల కార్యకలాపాలు కోసం క్యూ ఆర్ కోడ్ తప్పనిసరి చేయాలని, యూనియన్ బ్యాంకు నుంచి ఖాతా ప్రారంభించాన్నారు. రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 8వ తేదీన నేత్ర, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. రెడ్ క్రాస్ డొనేషన్ పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులను కూడా సభ్యులుగా చేర్చేలా అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి ఎస్.సరళా వందనం, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి, కలెక్టరేట్ ఏవో ఎండీ అలీ, క్రియాశీలక సభ్యురాలు డాక్టర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులతో గౌరవంగా మెలగాలి

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోల్ బ్యాంకుల్లో వినియోగదారులతో గౌరవంగా మెలగాలని, నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు సూచించారు. మంగళవారం జిల్లాలోని గోకవరం మండలంలోని భారత్ పెట్రోల్ బంక్ సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదు మేరకు బంకును సందర్శించి సిబ్బందిని హెచ్చరించారు. వినియోగదారులకు గాలి, నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, మరుగు దొడ్డి లాంటి సేవలు ఉచితంగా అందించాలని బంకు నిర్వాహకులకు సూచించారు. ఫిర్యాదులు ఉంటే లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లై, సంబంధిత సేల్స్ ఆఫీసర్ కు తెలియజేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సిబ్బంది ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేయరాదన్నారు. సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేస్తామని అనంతరావు తెలిపారు.

జీజీయూలో రెండు పాలిసెట్ కేంద్రాలు



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ మూర్తి

రాజానగరం: ఏపీ పాలిసెట్–2025 నిమిత్తం స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కళాశాల, ఆర్‌కె బ్లాక్‌లను పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించారు. అక్కడి ఏర్పాట్లను సాంకేతిక విద్య ఆర్‌జేడీ జె.సత్యనారాయణ మూర్తి మంగళవారం పరిశీలించారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో పరీక్ష రాసేందుకు వచ్చే అభ్యర్థుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ రెండు కేంద్రాలలో జరిగే పరీక్షలకు 1791 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం, వైస్ ప్రిన్సిపాల్ టి.రామారావు, బి.కిరణ్‌బాబు, బొమ్మూరులోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరావు తదితరులు ఆర్‌జేడీ వెంట ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



సింగవరం కైలాసభూమి నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలుతున్న ఇసుక

సీతానగరం: అనుమతి లేని ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సింగవరం కైలాసభూమి రోడ్డు నుంచి వందలాది ట్రాక్టర్లపై ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. సంభందిత అధికారులు కనీసం వాటిని అడ్డుకోవడం లేదు. అలాగే ముగ్గళ్ల ర్యాంపు నుంచి ఇసుక అనధికార తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే సింగవరం రేవు నుంచి ఇసుక అక్రమ తరలింపుతో తమ పంటలు పాడవుతున్నాయని, ట్రాక్టర్లు వేగంగా వెళ్లడంతో దుమ్ము ఎగసి పంట మొక్కలపై పడి పాడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న. దీని వెనుక ప్రజా ప్రతినిదులు అండదండలు దండిగా ఉన్నట్లు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

అధునాతన వైద్యంపై పీఎంపీలకు అవగాహన

జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి



వైద్య నిపుణులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పీఎంపీలు ఎప్పటికప్పుడు నూతన వైద్య విధానాలపై అవగాహన పొందడం అవసరమని పీఎంపీ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తోరాటి మాట్లాడుతూ ఈ సదస్సులు ప్రజలకు మేలైన వైద్యాన్ని అందించేందుకు ఉపకరిస్తాయని అన్నారు. కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మణికంఠ చౌదరి హాజరై అధునాతన శస్త్రచికిత్సల గురించి, డాక్టర్ ఆనంద్ చౌదరి అత్యాధునిక రోబో సర్జరీ ట్రీట్‌మెంట్ గురించి, డాక్టర్ పి.ప్రశాంత్ అత్యవసర ట్రామా కేసులలో పీఎంపీలు అందించే చికిత్సలను వివరించారు. అలాగే వైద్యులు టి శ్రీదేవి, ఎం.ఆదిత్య, రవితేజ తదితరులు పలు వైద్య విధానాలను వివరించారు. కార్యక్రమానికి సహకరించిన హాస్పిటల్ సీఈఓ డాక్టర్ రామరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మీడియా కన్వీనర్ ఐళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వైద్యనిపుణులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హైవే వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



పొట్టిలంక వద్ద హైవే వాహనాన్ని ఢీకొన్న బస్సు

కడియం: మండలంలోని పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే క్లీనింగ్ వాహనాన్ని రావులపాలెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు పొట్టిలంక వద్ద హైవే రోడ్డు క్లీనింగ్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు, ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో గాయపడిన వారిని రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కాగా బస్సు ఢీకొట్టిన వేగానికి హైవే క్లీనింగ్ వాహనం డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఘటనా స్థలానికి పోలీసులు, హైవే సిబ్బంది చేరుకుని ట్రాఫిక్‌కు అవాంతరం లేకుండా చర్యలు చేపట్టారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ శిక్షణ



స్విమ్మింగ్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి

పెదపూడి: చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధికి స్విమ్మింగ్ దోహదపడుతుందని జి.మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ముఖ్య సలహాదారు మండ రాజారెడ్డి తెలిపారు. ఈ క్లబ్‌లో వేసవి శిక్షణలో భాగంగా స్విమ్మింగ్ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ శిక్షణ శిబిరం జూన్ పదో తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఏటా క్లబ్‌లో స్విమ్మింగ్ శిక్షణ శిబిరం నిర్వహస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పప్పు శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ద్వారంపూడి బంగారు రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్.భాస్కరరెడ్డి, బాబీ, సోమిరెడ్డి, జొన్నాడ మాస్టారు, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాడ్రేవుకు పరశురామ పురస్కారం



పరశురామ పురస్కారాన్ని అందుకుంటున్న వాడ్రేవు శ్రీనివాస్‌కుమార్

రాజానగరం: మండలంలోని వెలుగుబందకు చెందిన మండల బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి వాడ్రేవు శ్రీనివాస్‌కుమార్‌కు జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ×పరశురామ× పురస్కారాన్ని అందజేసింది. పరశురామ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, ప్రతినిధి యల్లాప్రగడ సత్యనారాయణ సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. బ్రాహ్మణ సంఘానికి శ్రీనివాస్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

పేరు మార్పు

నేను, ప్రశాంత లక్ష్మి స్వరూప తాడేపల్లి, భర్త వెంకటేశ్ గుత్తుల గారు, డో.నెం. 4-644, మార్కండేయపురం, అనపర్తి మండలం, అనపర్తి, తూ.గో.జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నివాసి. నేను నా పేరు ప్రశాంత లక్ష్మి స్వరూప తాడేపల్లి (పాత పేరు) నుండి ప్రశాంతి లక్ష్మి స్వరూప గుత్తుల (కొత్త పేరు)గా మార్చుకున్నాను. ఇక మీదట అన్ని అవసరాలకు ప్రశాంతి లక్ష్మి స్వరూప గుత్తుల, భర్త వెంకటేశ్ గుత్తుల గా పిలువబడతాను.

